క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్‌వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషీన్ల ట్రయల్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు డా.జి.శ్రీలత తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ పరీక్షలు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు నం. 9985631926లో సంప్రదించవచ్చన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలలో పాల్గొన్న భక్తులు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24 వరకు నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన, విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వరిణి సమర్పణ, తిరువీధి ఉత్సవం మృత్యంగ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో కృతిశెట్టి సందడి



శ్రీలక్ష్మీ వైట్‌హౌస్ టెక్స్‌టైల్స్ హ్యాండ్లూమ్ జ్యువెలరీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కృతిశెట్టి

హుడాకాంప్లెక్స్: కొత్తపేటలో ఆదివారం సినీ నటి కృతిశెట్టి సందడి చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ వైట్‌హౌస్ టెక్స్‌టైల్స్ హ్యాండ్లూమ్ జ్యువెలరీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బొమ్మ రఘురాంనేత, చిక్క శ్రీనివాస్, పెద్ది జగదీశ్, తడక రమేష్, వెంకటేశం, కస్తూరి సుదర్శన్, తడక యాదగిరి, గుజ్జ సత్యం పాల్గొన్నారు.

'డ్వాబ్'లో వైట్ కేన్ అవేర్‌నెస్ డే



కార్యక్రమంలో పాల్గొన్న డ్వాబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ చింతలకుంట జహంగీర్‌నగర్‌లోని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ (డ్వాబ్) రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వైట్ కేన్ అవేర్‌నెస్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్ ఎర్రవెల్లి అమర్‌నాథ్ రావు హాజరై అంధులకు వైట్ కేన్ చేతి కర్రలను అందజేశారు. అంధులు కరెన్సీ నోట్లను గుర్తించి చెప్పే పరికరం గురించి విల్సన్ రాజ్‌కుమార్ వివరించారు. డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లయన్ నర్సింహారావు, డ్వాబ్ ఉపాధ్యక్షుడు ముక్తాధర్, మాజీ ఉపాధ్యక్షుడు రంగారావు, కోశాధికారి పరమేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హయత్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... హయత్‌నగర్‌లోని సూర్యానగర్‌కు వెళ్లే దారిలో గుర్రం సత్తిరెడ్డి పార్కింగ్ యార్డుకు ఎదురుగా నిర్జన ప్రదేశంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందని, తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎడమ చేతిపై రామచంద్రు అని తెలుగులో, కుడి చేతిపై ఎస్ఎంఎల్ అని ఇంగ్లిషులో పచ్చబొట్టు ఉందన్నారు. షర్ట్‌పై ఫ్యాషన్ లుక్ టెక్స్‌టైల్స్ అండ్ టైలరింగ్ లాల్‌భాగ్ అంబర్‌పేట అని లేబుల్ ఉందన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో 8712662301 సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



నాగోలు శ్రీసాయినగర్‌లో... బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత



శ్రీ స్వర్ణకవచ దుర్గాదేవి అలంకారంలో విజయదుర్గా మాతా



బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన జయదుర్గాదేవి

వైభవంగా దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దిల్‌సుఖ్‌నగర్ సాయి ఆలయంలో దేవినవరాత్రి ఉత్సవాలు



శ్రీ వన బాలాదేవి అలంకరణలో కొత్తపేట శ్రీ ప్రసన్న మహాకాళి అమ్మవారు



అలయంలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్న అర్ధం సునీల్‌రెడ్డి

మలక్‌పేట, ఎల్బీనగర్ జోన్ల బృందం: మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద కొలువైన అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాతా ఆలయంలో శ్రీ స్వర్ణ కవచ దుర్గాదేవి అలంకారంలో, జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగ దర్శనమిచ్చారు. విజయదుర్గా మాత అలయంలో నిర్వహించిన చండీ హోమంలో అర్ధం సునీల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

◆ కొత్తపేటలోని ప్రసన్న మహాకాళి ఆలయంలోని అమ్మవారు శ్రీ వన బాలాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవీ ఉపాసకులు భారతుల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్ట్ చైర్మన్ వజీర్ ప్రకాష్ గౌడ్ దంపతులు గోమాత పూజ, చండీయాగం నిర్వహించారు.

◆ దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలోని షిరిడీ సాయిబాబా 105వ మహాసమాధి పుణ్యతిథి ఉత్సవాలు, శ్రీదేవి నవరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.



హయత్‌నగ్‌లో దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు



ఎస్కేడినగర్‌లో నవయువత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



వనస్థలిపురంలో కనకదుర్గాదేవి ఆలయంలో...

రియల్ ఎస్టేట్ నుంచి రాజకీయాల్లోకి..!

జంగ్ 2023 తెలంగాణ

- అరంగేట్రంతోనే వరించిన టికెట్
- మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ అక్బర్



దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ షేక్ అక్బర్‌ను వరించింది. మలక్‌పేట నుంచి పోటీ కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ నూతన నాయకుడికి అవకాశం కల్పించింది. రాజకీయాల్లో అరంగేట్రం చేస్తూనే షేక్ అక్బర్ కాంగ్రెస్‌లో టికెట్ దక్కించుకోవడం విశేషం. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన అక్బర్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఏవీ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశారు. తన విద్యార్హతలతో పలు సంస్థల్లో 16 సంవత్సరాలు వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం 2017లో సొంతంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం స్థాపించి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన స్థాపించిన సంస్థ జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కించుకుంది. వ్యాపార రంగంలో ఉన్న అక్బర్ కరోనా సహా పలు సందర్భాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నుంచి రాజకీయాల్లో చేరి జాతీయ పార్టీ కాంగ్రెస్ నుంచి మలక్‌పేట నియోజకవర్గం నుంచి టికెట్ సాధించిన ఆయన ఎన్నికల్లో ఏ మేర పోటీ ఇస్తారో వేచి చూడాల్సిందే.

వివరాలు..

పేరు: షేక్ అక్బర్
పుట్టిన తేదీ: 24–05–1982
విద్యార్హతలు: డిగ్రీ, ఎంబీఏ
కుటుంబం : భార్య, కుమారుడు, కూతురు
వృత్తి : రియల్ ఎస్టేట్ వ్యాపారం
నియోజకవర్గం: మలక్‌పేట

కాంగ్రెస్ హామీలకు ఆకర్శితులై భారీ చేరికలు: ముద్దగౌని

చంపాపేట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలకు ఆకర్శితులై భారీఎత్తున పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డిలో జరిగిన ఓ సమావేశంలో ఆయన సమక్షంలో ఎల్‌బీనగర్‌కు చెందిన పలువురు మైనార్టీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అజార్‌భాయ్, జాకీర్, జావేద్, ఫారూక్, షబ్బీర్, ఇజామ్, షకృద్దీన్, సాజిద్, వహీద్, ఫయాజ్, నాయకులు రాజుగౌడ్, శ్రీశైలం ఉన్నారు.

తనిఖీలో రూ. 3.57 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: శాసన సభ ఎన్నికల సందర్భంగా వనస్థలిపురం పోలీసులు ఆదివారం రాత్రి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.3.57లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ ప్రాంతంలో రూ.1.69 లక్షలు, సహారా రోడ్డులో రూ.1.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వనస్థలిపురం చింతలకుంట రేడియోస్టేషన్ దగ్గర రూ. 63 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జలేంధర్‌రెడ్డి వెల్లడించారు.

కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేశా

మలక్‌పేట: కుల మతాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో పర్యటించారు. కాలనీ సంఘాలు, సినీయర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలే ఏజెండాగా పని చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూశామన్నారు. రాజీ పడకుండా మలక్‌పేటను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించామన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పతంగ్ గుర్తుపై ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్

దిల్‌సుఖ్‌నగర్: దేశ అంతరిక్ష ప్రయోగాలకు, దేశ రక్షణ కోసం ఏపీజే అబ్దుల్ కలామ్ ఎంతో కృషి చేశారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కేపురం చిత్రాలేఅవుట్‌లోని మహాత్మా గాంధీ లా కాలేజీలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వివిధ రంగాల్లో సేవలందించిన ఉత్పల అరుణ జ్యోతి, డాక్టర్ నల్లదీగ శ్రీనివాసాచార్యులు, డాక్టర్ డి.చక్రధర్, లావు నరేంద్ర సాయి (పచ్చల తాడిపత్రు) అనాధ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్‌లకు ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ లయన్ రామచంద్ర రావు ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందజేశారు. లా కళాశాల కరెస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి నిర్వాహకులు మురళీమోహన్ రాజు, రామచంద్ర రావు, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళనం మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంటలోని ప్రలవిగార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల న్యాయమైన కోరికలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని సుధీర్‌రెడ్డి కోరారు.

జీఓ నెంబర్ 13ను రద్దు చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలోని 33 జిల్లాలలో షెడ్యూల్డ్ క్యాస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న దాదాపు 77 మందికి డిగ్రీ అర్హతతోనే ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ హాస్టల్స్ నాలుగో తరగతి ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ నాయక్ కోరారు. ఆదివారం ఆర్‌కేపురంలోని బాబూ జగ్జీవన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సంవత్సరంలో జీఓ నెంబర్ 20 ప్రకారం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులైన కుక్, కామటి, వాచ్‌మెన్‌లకు డిగ్రీ అర్హతతోనే గ్రేడ్–2 ప్రమోషన్లు కల్పించాలని జీఓ తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2022 సంవత్సరంలో జీఓ నెంబర్ 13 తీసుకొచ్చి డిగ్రీతో పాటు బీఈడీ అర్హత ఉంటేనే గ్రేడ్–2గా ప్రమోషన్ ఇస్తామని జీఓ తీసుకొచ్చిందన్నారు. ఈ జీఓ వల్ల తమ సర్వీసు కోల్పోతున్నామని వారు వాపోయారు. అసోసియేషన్ సహాయ కార్యదర్శి అంజయ్యతో పాటు స్వామి, భాస్కర్, కృష్ణ, ఇషాక్, రవిశంకర్, ఈశ్వరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి: సీపీఐ

నాగోలు: గత పదేళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఇబ్బందులకు గురి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం ఆదివారం కొత్తపేట డివిజన్ న్యూనాగోలు కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో బోడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆందోజు రవీంద్రా చారి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో గెలుపోటములను నిర్దేశించే శక్తి సీపీఐకి ఉందన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పార్టీ నాయకత్వం నడుచుకోవాలని సూచించారు. బీజేపీ వల్ల ఈ దేశంలో మధ్య తరగతి బతుకులు చితికిపోయాయని అన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ బాధ్యులు సుధాకర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులు రాములు గౌడ్, భూపతి సురేష్, సక్రునాయక్, శ్రీదేవి, సుభద్ర, సరిత, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాక్‌టౌన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎర్ర వినోద్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: మన్సూరాబాద్ పరిధిలోని రాక్‌టౌన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎర్ర వినోద్‌రెడ్డి ఘన విజయం సాధించారు. మొత్తం 766 ఓట్లకు గాను 526 ఓట్లు పోలయ్యాయి. అందులో వినోద్‌రెడ్డికి 326 ఓట్లు రాగా.. ప్రత్యర్థి ఇంద్రారెడ్డికి 195 ఓట్లు వచ్చాయి. 5 ఓట్లు చెల్లలేదు. మొత్తంమీద 131 ఓట్ల తేడాతో వినోద్‌రెడ్డి గెలుపొందారు. కాగా ఉపాధ్యక్షుడిగా టి.మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జయపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎస్.సూర్యనారాయణ, కోశాధికారిగా జి.నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వినోద్‌రెడ్డి మాట్లాడుతూ రాక్‌టౌన్ కాలనీని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తనను ఎన్నుకున్నందుకు కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలే బీజేపీకి అండ



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం నాయుడు

మన్సూరాబాద్: కార్యకర్తలే బీజేపీ పార్టీకి అండని, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ ఎల్‌బీనగర్ ఎన్నికల ఇన్‌చార్జి మునిరత్నం నాయుడు అన్నారు. బీజేపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ బూత్ అధ్యక్షుల సమావేశం మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలు యుద్ధం లాంటివని, యుద్ధంలో సైనికులు రాజుకు ఏ విధంగా అండగా ఉంటారో బీజేపీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, నియాజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, పవన్‌కుమార్, కళ్లెం నవజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను చిన్న చూపు చూసే పార్టీలకు బుద్ధి చెబుతాం

చాదర్‌ఘాట్: వికలాంగులను చిన్న చూపు చూసే పార్టీలకు తమ ఓట్లతో బుద్ధి చెపుతామని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో హెలెన్ కెల్లర్ రీజనల్ అసోసియేషన్ ఫర్ ది డిజెబుల్ అధ్యక్షుడు పీవీ రావు అధ్యక్షతన నిర్వహించిన ఇంటర్నేషనల్ వైట్ కాన్ డేలో పాల్గొని వికలాంగులకు చేతికర్రలు పంపిణీ చేశారు.

బూత్‌ల బలోపేతం ద్వారా గెలుపు సాధ్యం : బీజేపీ ఎంపీ

మలక్‌పేట: బూత్‌లను బలోపేతం చేయడం ద్వారా గెలుపు సాధ్యమని బీజేపీ గోవా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు సదానంద్ సేతె అన్నారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని కమ్యూనిటీహాల్లో మలక్‌పేట నియోజకవర్గ కార్యకర్త విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ సదానంద్ సేతె మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో ప్రణాళికాయుతంగా ప్రతీ ఓటర్‌ను కలిసి ఓటు వేయించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, హైద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి గోలి మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్‌చందర్ జీ, నర్సింహ, యాదగిరెడ్డి, డివిజన్ల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నాగోలు: పరిసరాల పరిశుభ్రత అందరూ పాటించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ సూచించారు. ఆదివారం స్వచ్ఛత మిషన్‌లో భాగంగా బండ్లగూడ రాజీవ్ స్వగృహ సాభావన డి–బ్లాక్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంబురాలు



చంపాపేటలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నల్లా రఘుమారెడ్డి

మన్సూరాబాద్: సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించినందుకు బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసుకున్నారు. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరన్నగుట్టలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, రాంకోటి, ప్రవీణ్‌రెడ్డి, పారంద నర్సింగ్, కేకేఎల్‌గౌడ్, వెంకట్‌రావు, తిరుమల, కృష్ణ, నర్సింహయాదవ్, సత్తయ్య, భాస్కర్, కరుణ, నవనీత, మాధవి, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

చంపాపేట: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా చంపాపేట చౌరస్తాలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ నాయకులు ముడుపు రాజిరెడ్డి, రవిముదిరాజ్, రోజారెడ్డి, అంజిరెడ్డి, తిరుమలేష్, సురేందర్‌రెడ్డి, జంగయ్య, ఉమామహేశ్వర్, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా పూల పండుగ

మలక్‌పేట /ఎల్బీనగర్ జోన్ బృందం: బతుకమ్మ సంబురాలు ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, కోలాటం ఆడారు. ఆ తర్వాత కొలనుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో హిమపురి కాలనీకి చెందిన వి.మాధవీ కిరణ్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఆమెను కాలనీ వాసులు అభినందించారు.



మూసారంబాగ్‌లో.. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



లక్ష్మీనగర్ కాలనీలో.. తీగల అజిత్‌రెడ్డి, సునరితారెడ్డి



అల్కాపురిలో మాజీ కార్పొరేటర్ దేప సురేఖ



ఆర్‌కే పురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు